గాలికి వదిలేస్తే.. గాడిన పెట్టిన కేసీఆర్



రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులు అనగానే కేసీఆర్ గుర్తుకు వస్తారు. ఎందుకంటే ఏండ్ల తరబడి సాగిన వీటి నిర్మాణంపై దృష్టి సారించిన ఆయన 10 ఏండ్లలో ఎన్నో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు నీరందించారు. కచ్చితమైన ప్రణాళిక, వనరుల సమీకరణ, అధికారుల నియామకం, సత్వర నిర్ణయాల ఫలితం గానే పదేళ్ల కాలంలో అనేక అద్భుతాలను చేసి చూపారు. భక్తరామదాసు, తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకాలనైతే కేవలం 10 నెలల కాలంలోనే సాకారం చేశారు. స్వరాష్ట్రంలో చేపట్టిన కీలక ప్రాజెక్టులన్నీ దాదాపు పూర్తిచేయడం కేసీఆర్ లక్ష్య సాధనకు నిదర్శనం. వాటిలో మచ్చుకు కొన్నింటి వివరాలు సంక్షిప్తంగా..

• ఎత్తిపోతల పేరు: కోయిల్‌సాగర్ || జిల్లా: ఉమ్మడి మహబూబ్‌నగర్

వినియోగంలోకి తెచ్చింది: బీఆర్ఎస్ ప్రభుత్వం
ప్రారంభం:2000.. పూర్తయింది: 2017
పనులు సాగింది: 17 ఏండ్లు
సాగులోకి తెచ్చిన ఆయకట్టు: 8 వేల ఎకరాలు

• ఎత్తిపోతల పేరు: రాజీవ్ భీమా || జిల్లా:ఉమ్మడి మహబూబ్‌నగర్

వినియోగంలోకి తెచ్చింది: బీఆర్ఎస్ ప్రభుత్వం
ప్రారంభం:1983.. పూర్తయింది: 2016
పనులు సాగింది: 33 ఏండ్లు
సాగులోకి తెచ్చిన ఆయకట్టు: 1,58,000 ఎకరాలు

• ఎత్తిపోతల పేరు: మిడ్‌మానేరు || జిల్లా: ఉమ్మడి కరీంనగర్

వినియోగంలోకి తెచ్చింది: బీఆర్ఎస్ ప్రభుత్వం
ప్రారంభం:2005.. పూర్తయింది: 2018
పనులు సాగింది: 13 ఏండ్లు
సాగులోకి తెచ్చిన ఆయకట్టు: 1,00,000 ఎకరాలు

• ఎత్తిపోతల పేరు: పాలమూరు రంగారెడ్డి || జిల్లా:ఉమ్మడి మహబూబ్‌నగర్
ప్రారంభం:2015.. పూర్తయింది: 2023
పనులు సాగింది: 8 ఏండ్లు
సాగులోకి తెచ్చిన ఆయకట్టు: డిస్ట్రిబ్యూటరీలు తవ్వాలి
వినియోగంలోకి తెచ్చింది: బీఆర్ఎస్ ప్రభుత్వం

• ఎత్తిపోతల పేరు: నెట్టెంపాడు || జిల్లా: ఉమ్మడి మహబూబ్‌నగర్

వినియోగంలోకి తెచ్చింది: బీఆర్ఎస్ ప్రభుత్వం
ప్రారంభం:1991.. పూర్తయింది: 2016
పనులు సాగింది: 25 ఏండ్లు
సాగులోకి తెచ్చిన ఆయకట్టు: 1,42,000 ఎకరాలు

• ఎత్తిపోతల పేరు: చనకాకొరాట || జిల్లా: ఉమ్మడి ఆదిలాబాద్

వినియోగంలోకి తెచ్చింది: బీఆర్ఎస్ ప్రభుత్వం
ప్రారంభం:1975.. పూర్తయింది: 2023
పనులు సాగింది: 48 ఏండ్లు
సాగులోకి తెచ్చిన ఆయకట్టు: 40,000 ఎకరాలు

• ఎత్తిపోతల పేరు: కల్వకుర్తి || జిల్లా:ఉమ్మడి మహబూబ్‌నగర్



వినియోగంలోకి తెచ్చింది: బీఆర్ఎస్ ప్రభుత్వం
ప్రారంభం:1984.. పూర్తయింది: 2016
పనులు సాగింది: 32 ఏండ్లు
సాగులోకి తెచ్చిన ఆయకట్టు: 3,07,000 ఎకరాలు

గడువులోగా సాధ్యమయ్యేనా?

- మార్కెట్ ధర రూ.50 లక్షలైతే.. ఇస్తున్నది రూ.6 లక్షలే
- భూసేకరణపై రైతులను ఒప్పించాలంటూ కలెక్టర్లపై ఒత్తిడి
- ట్రిపుల్ ఆర్ భవితవ్యంపై సర్వత్రా అనుమానాలు

హైదరాబాద్, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ): రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ఆర్) నిర్మాణానికి అవసరమైన భూముల సేకరణ కోసం రైతులను ఎలాగైనా ఒప్పించాలని సీఎం రేవంత్‌రెడ్డి గత నెలలో కలెక్టర్లను ఆదేశిస్తే.. వచ్చే నెల రెండో వారం చివరినాటికి ఈ భూసేకరణ ప్రక్రియను పూర్తిచేయాలని తాజాగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గడువు విధించారు. కానీ, ఆ భూములకు మార్కెట్‌లో ఉన్న ధరలకు, ప్రభుత్వం ఇవ్వజూపుతున్న ధరలకు ఏ మాత్రం పొంతన లేకపోవడం పెద్ద అడ్డంకిగా మారింది. ట్రిపుల్ఆర్‌ను నిర్మించతలపెట్టిన ప్రాంతాల్లో ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో ఎకరం ధర రూ.50 లక్షల వరకు పలుకుతుంటే.. రైతులకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్హెచ్ఏఐ) రూ.6 లక్షలు మాత్రమే ఆఫర్ చేస్తున్నది. దీంతో భూములను ఇచ్చేందుకు రైతులు నిరాకరిస్తుండటంతో కలెక్టర్లు ముందడుగు వేయలేని పరిస్థితి నెలకొన్నది. మొత్తం 348 కి.మీ. పొడవున నిర్మించతలపెట్టిన ట్రిపుల్ఆర్ కోసం దాదాపు 10 వేల ఎకరాల భూములను సేకరించాల్సి ఉన్నది. ఇందులో 158.65 కి.మీ. పొడవైన ఉత్తర భాగం నిర్మాణానికి 4,600 ఎకరాలు, 189.02 కి.మీ పొడవైన దక్షిణ భాగం నిర్మాణానికి 5,400 ఎకరాలు అవసరమవుతాయి. ట్రిపుల్ఆర్ నిర్మాణానికి అయ్యే ఖర్చు పూర్తిగా కేంద్రమే భరించనుండగా.. భూసేకరణ ఖర్చులో మాత్రం సగభాగాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంటుంది. భూసేకరణ బాధ్యతలను స్థానిక జిల్లా కలెక్టర్లకు అప్పగించినప్పటికీ రైతులకు ఇవ్వాల్సిన నష్టపరిహారాన్ని మాత్రం ఎన్హెచ్ఏఐ ద్వారానే చెల్లిస్తారు. కాగా, ట్రిపుల్ఆర్ ఉత్తర భాగంలో ఇప్పటికే దాదాపు 3,500 ఎకరాలు సేకరించారు. మిగిలిన 1,000 ఎకరాల్లో సుమారు 200 ఎకరాల అటవీ భూమి ఉన్నది. ఈ భూమికి బదులుగా అటవీశాఖకు మరోచోట భూమిని ఇచ్చేందుకు ప్రభుత్వం ఇప్పటికే సంసిద్ధత వ్యక్తం చేసినప్పటికీ మిగిలిన 800 ఎకరాల సేకరణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎన్హెచ్ఏఐ ఆఫర్ చేసిన ధరకు భూములు ఇచ్చేందుకు రైతులు ససేమిరా అంటున్నారు. బహిరంగ మార్కెట్ ధరకు అనుగుణంగా తమకు నష్టపరిహారం చెల్లించాలని లేదా తమకు ప్రభుత్వం మరో చోట భూములు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే ట్రిపుల్ఆర్ నిర్మాణానికి తమ భూములు ఇచ్చే ప్రసక్తే లేదని స్పష్టం చేస్తున్నారు. ఈ విషయమై ఇప్పటికే కొందరు రైతులు కోర్టును ఆశ్రయించడంతో భూసేకరణపై కోర్టు స్టే విధించింది. ఈ నేపథ్యంలో ట్రిపుల్ఆర్ భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్లపై ప్రభుత్వం ఎంత ఒత్తిడి తెచ్చినా ఫలితం ఉండకపోవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

త్వరలో నష్టపరిహారం చెల్లింపు: ఎన్హెచ్ఏఐ

ట్రిపుల్ఆర్ నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు త్వరలో నష్టపరిహారం చెల్లిస్తామని ఎన్హెచ్ఏఐ అధికారులు తెలిపారు. ఇప్పటివరకు సేకరించిన భూములకు స్థానిక ఆర్డీవో, కలెక్టర్ నిర్ధారించిన ధరను చెల్లిస్తామని అంటున్నారు. ధర ఎంతన్నది తమకు సంబంధం లేదని, నిబంధనల ప్రకారం అధికారులు నిర్ధారించిన ధర చెల్లిస్తామని చెప్తున్నారు. వచ్చే నెల రెండో వారంలోగా భూసేకరణ పూర్తిచేస్తే టెండర్లకు మార్గం సుగమం అవుతుందని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. భూముల ధర, పరిహారం పెంపుపై ఇప్పటివరకు స్పష్టమైన ప్రకటన చేయకపోవడంతో ట్రిపుల్ఆర్ భవితవ్యంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అంగన్‌వాడీ కేంద్రాలకు కుళ్లిన గుడ్లు

- పిల్లలు, తల్లులు, గర్భిణులకు అవే పంపిణీ
- కరీంనగర్ జిల్లా అంగన్‌వాడీ కేంద్రంలో బట్టబయలు
- రాష్ట్రంలో చాలా చోట్ల ఇదే పరిస్థితి

హైదరాబాద్, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. వాటిలో చిన్న పిల్లలు, గర్భిణులు, బాలింతలకు కుళ్లిన కోడిగుడ్లు సరఫరా చేస్తున్నారు. ఇటీవల కరీంనగర్ జిల్లాలోని ఓ అంగన్‌వాడీ కేంద్రంలో గుడ్లపై అనుమానం వచ్చి పగలగొట్టి చూడటంతో ఓ గుడ్డు నుంచి కోడి పిల్ల బయటకు వచ్చింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యమైన కోడిగుడ్లను సరఫరా చేయాల్సిన అధికారులు.. కాసులకు కక్కుర్తిపడి కుళ్లిన గుడ్లను సరఫరా చేస్తున్నట్టు తెలిసింది. ప్రస్తుతం శ్రావణ మాసం కొనసాగుతుండటంతో చికెన్‌తోపాటు గుడ్లకు డిమాండ్ తగ్గిపోయింది. దీంతో చాలా గుడ్లు పౌల్ట్రీల్లోనే మురిగిపోతున్నాయి. ఇలాంటి కోడిగుడ్లను అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసి, సొమ్ము చేసుకోవాలని చూస్తున్న కొందరు అధికారులు కన్సల్టెంట్లతో ఒప్పందాలు చేసుకుంటున్నారు. కుళ్లిన కోడిగుడ్లను తక్కువ ధరకు కొనుగోలు చేసి, వాటిని అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్నారు. మరికొన్ని జిల్లాల్లో కన్సల్టెంట్లు అసలు గుడ్లనే సరఫరా చేయడం లేదని, వాటిని మధ్యలోనే దళారులు మింగేస్తున్నారని ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. కోడిగుడ్లను సరఫరా చేయకముందే ఐసీడీసీ అధికారులకు బిల్లులు పెడుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 35,700 అంగన్ వాడీ కేంద్రాలు పని చేస్తున్నాయి. వాటిలో 4,57,643 మంది గర్భిణులు, 10,44,562 మంది బాలింతలు, 6,67,783 మంది చిన్నారులు ఉన్నట్టు అధికారిక లెక్కలు స్పష్టం చేస్తున్నాయి.

సీవోఈ సిబ్బందిపై సర్కారు కాఠిన్యం

- జీతాలు అడిగినందుకు ఏకంగా తొలగింపు!
- 2 నెలలుగా వేతనాలివ్వడం లేదని పెన్‌డౌన్
- రెగ్యులర్ సిబ్బంది కోసం సెక్రటరీ ప్రకటన
- ర్యాంకులు తెచ్చిన గురుకుల సిబ్బందిపై కుట్ర

గౌలిదొడ్డిలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రంలో సిబ్బంది నిరసన

హైదరాబాద్, ఆగస్టు15 (నమస్తే తెలంగాణ): ప్రతిష్ఠాత్మకమైన ఐఐటీ, నీట్ లాంటి జాతీయస్థాయి ఎంట్రెన్స్‌లలో వందలాది మంది గురుకుల విద్యార్థులకు ర్యాంకులు తెప్పించారు. జీవితంలో ఉన్నత విద్యను అభ్యసించేందుకు వారిని ఉత్తములుగా తీర్చిదిద్దారు. మొత్తంగా గురుకులాలకే వన్నెతెచ్చారు. ఇంత చేసిన తమకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని మాత్రమే వారు అడిగారు. నెలలు గడుస్తుంటే పెన్‌డౌన్ చేసి నిరసన తెలిపారు.. అదే ఇప్పుడు వారి పాలిట శాపమైంది. ఫలితంగా రాష్ట్ర సర్కారు కాటుతో వారిపై వేటుపడింది. టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐ సొసైటీ పరిధిలోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సీవోఈ)లలో పనిచేసే హానరోరియం సిబ్బందిని ప్రభుత్వం తొలగించింది. రెండు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని, కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారడంతో ప్రభుత్వ దృష్టికి వెళ్లేలా చేయడంతో ప్రభుత్వం మాత్రం వారిపై కాఠిన్యం ప్రదర్శించింది. రాష్ట్రంలో 38 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాలు ఉన్నాయి. ఆ సీవోఈల్లో బాలికలకు 2,000, బాలురకు 1,680 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

38 సీవోఈల్లో 231 మంది సిబ్బంది

అన్ని సీవోఈల్లో కలిసి అందులో కెమెస్ట్రీ, మ్యాథ్స్, ఫిజిక్స్, బోటనీ, జువాలజీ విషయ నిపుణులు, సీనియర్ అధ్యాపకులు కలిపి మొత్తంగా 231 మంది సిబ్బంది ఉన్నారు. పనివిధానాన్ని బట్టి సిబ్బందికి హానరోరియం పేరిట వేతనాలను చెల్లిస్తున్నారు. ఆగస్టు15 దాటినా జూన్, జూలై నెలలకు సంబంధించిన వేతనాలను ప్రభుత్వం విడుదల చేయలేదు. దీంతో వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే పలుమార్లు సొసైటీ ఉన్నతాధికారులకు నివేదించారు. అయినా స్పందన కరువైంది. దీంతో ఇటీవలే పెన్‌డౌన్ ప్రకటించి నిరసన తెలిపారు.

వేతనాలు అడిగిన సీవోఈ కేంద్రాల సిబ్బందిపై ప్రభుత్వం ఇప్పుడు కక్షసాధింపు చర్యలకు దిగింది. తాజాగా గౌలిదొడ్డి, కరీంనగర్, చిల్కూర్, మహేంద్రహిల్స్, నార్సింగి, షేక్‌పేట్ తదితర సీవోఈల్లో మొత్తంగా 57 మందిని తొలగించి రెగ్యులర్ సిబ్బంది నియామకానికి సొసైటీ సెక్రటరీ అలుగు వర్షిణి ఉత్తర్వులు జారీ చేశారు. సీవోఈల్లో పనిచేయాలనే ఆసక్తి ఉన్న నాన్ సీవోఈల్లో పనిచేస్తున్న రెగ్యులర్ జేఎల్, పీజీటీలు దరఖాస్తు చేసుకోవాలని, వారికి డిప్యూటేషన్ కల్పిస్తామని సెక్రటరీ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

విద్యార్థులకు తీరని నష్టం

సీవోఈ కేంద్రాల సిబ్బంది తొలగింపు నిర్ణయం అక్కడి విద్యార్థులకు తీరని నష్టం కలుగనున్నది. లక్షలాది రూపాయల విలువ చేసే కోచింగ్‌ను ఈ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో నిరుపేద విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నది. కార్పొరేట్ స్థాయిలో ఇంటర్ విద్యను అందిస్తున్నారు. జాతీయ పోటీ పరీక్షల్లో ఏటేటా వందలాది ర్యాంకులు వచ్చేలా ఈకేంద్రాలు దోహదపడుతున్నాయి. ఇప్పుడు ఏకంగా ఆ విధానానికి స్వస్తిపలికి రెగ్యులర్ సిబ్బందితో చెప్పించడమంటే సీవోఈలనే నిర్వీర్యం చేసినట్టేనని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి.

• బీర్ టిన్‌లో ఇరుకున్న పాము

గురువారం జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం నల్లగొండ శివారులోని రైతు వేదిక మైదానంలో మందుబాబులు తాగి పడేసిన బీర్ టిన్‌లో పాము దూరడానికి యత్నించింది. అందులో తల ఇరుక్కుపోయి బయటికి రాలేక తల్లడిల్లింది. మూడు గంటలపాటు అటూ ఇటూ తిరిగింది. స్థానికులు దానిని తీసే ప్రయత్నం చేసినా సాధ్యం కాలేదు. చివరకు పాము ముళ్లకంపలో నుంచి వెళ్తుండగా టిన్ ఊడిపోవడంతో బతుకుజీవుడా అంటూ వెళ్లిపోయింది.

ప్రతి నెల పరీక్షలకు ముగింపు..

- ఈ ఏడాదిలోనూ ఎఫ్ఎల్ఎన్, లిప్ అమలు
- పర్యవేక్షణకు తెలంగాణ స్టేట్ ఎడ్యుకేషన్ యాప్

హైదరాబాద్, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ): సర్కారు పాఠశాల విద్యార్థుల్లో విద్యా ప్రమాణాల పెంపు, కనీస సామర్థ్యాల సాధనకు గతంలో నిర్వహించిన ఎఫ్ఎల్ఎన్, లిప్ కార్యక్రమాలను ఈ విద్యాసంవత్సరం సైతం కొనసాగించాలని విద్యాశాఖ నిర్ణయించింది. వీటి అమలులో కొన్ని మార్పులు చేస్తూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి కీలక ఆదేశాలు జారీచేశారు. విద్యాప్రమాణాల పెంపుకు గత కేసీఆర్ సర్కారు హయాంలో 1-5 తరగతులకు ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ(ఎఫ్ఎల్ఎన్), 6 -9 తరగతులకు లర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం(లిప్)ను విద్యాశాఖ తలపెట్టింది. ఎఫ్ఎల్ఎన్‌ను తొలిమెట్టు, లిప్‌నకు ఉన్నతి అని నామకరణం చేశారు. అయితే ఈ ప్రోగ్రాంల్లో భాగంగా విద్యార్థులకు ప్రతి నెల పరీక్షలు నిర్వహించేవారు. కానిప్పుడు ప్రతినెల పరీక్షలకు పాఠశాల విద్యాశాఖ ముగింపు పలికింది. వీటిస్థానంలో ఆగస్టులో బేస్‌లైన్ టెస్ట్, డిసెంబర్‌లో మిడ్‌లైన్ పరీక్ష, మార్చిలో ఎండ్‌లైన్ పరీక్షలను నిర్వహించాలని సూచించారు. సబ్జెక్టులవారీగా విద్యార్థుల పురోగతిని అంచనావేసి, నమోదుచేస్తారు. ఫలితాలను 'తెలంగాణ స్టేట్ ఎడ్యుకేషన్ యాప్'లో నమోదుచేస్తారు. మండల ఎఫ్ఎల్ఎన్ నోడల్ అధికారులు, హెచ్ఎంలు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరుపుతారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బడుల్లో తనిఖీలు నిర్వహిస్తారు. తరగతి గదిబోధనను పరిశీలించి, ఫీడ్‌బ్యాక్ ఇస్తారు.

బిల్లులు ఇస్తేనే.. మందులిస్తాం

- ప్రభుత్వ దవాఖానలకు సరఫరా నిలిపివేసిన డీలర్లు
- 600 కోట్ల బిల్లులు బకాయిపడిన రాష్ట్ర ప్రభుత్వం
- సీజనల్ వ్యాధుల వేళ వేధిస్తున్న ఔషధాల కొరత

హైదరాబాద్, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో సర్కారు వైద్యాన్ని పాలకులు గాలికొదిలేశారు. ప్రభుత్వ దవాఖానల్లో మందుల సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఫలితంగా సరైన మందులు దొరక్క, ప్రైవేటుగా కొనలేక రోగులు సతమతం అవుతున్నారు. ఔషధాల పంపిణీదారులకు ప్రభుత్వం పెండింగ్ బిల్లులు మంజూరు చేయకపోవడంతో వారు సరఫరాను నిలిపివేశారు. దీంతో దవాఖానలకు వచ్చేవారికి డాక్టర్ రాసిచ్చిన మందుల్లో సగం బయట కొనుక్కోవాల్సిన దుస్థితి నెలకొన్నది. గాంధీ, ఉస్మానియా వంటి ప్రధాన దవాఖానల్లోనూ ఇదే పరిస్థితి. ప్రాణాధార మందులకు సైతం ఇబ్బందిగా ఉన్నదని వైద్యవర్గాలు చెప్తున్నాయి. కొన్నిరకాల అత్యవసర ఔషధాలను ఆయా దవాఖానలు సొంతంగా కొనుగోలు చేయాల్సి వస్తున్నదని వాపోతున్నాయి. ప్రభుత్వం తమకు రూ.600 కోట్ల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉన్నదని ఔషధ పంపిణీ ఏజెన్సీలు, డీలర్లు చెప్తున్నారు. వీటిని విడుదల చేయాలని కొన్ని నెలలుగా కోరుతున్నా ఫలితం లేదని వాపోతున్నారు. దీంతో మందుల సరఫరాను నిలిపివేసినట్టు చెప్తున్నారు.

కేంద్రం సొమ్మును తొక్కిపెట్టిన రాష్ట్రం

ఈఎస్ఐ దవాఖానలు, డిస్పెన్సరీలకు మందులు సరఫరా చేసిన డీలర్లకు కేంద్ర ప్రభుత్వం రూ.180 కోట్లు విడుదల చేసిందని ఔషధ పంపిణీ ఏజెన్సీ ప్రతినిధులు, డీలర్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందులో రూ.35 కోట్లు మాత్రమే విడుదల చేసిందని, మిగతా రూ.145 కోట్లను ఎందుకు విడుదల చేయడం లేదో తెలియడం లేదని పేర్కొన్నారు. కనీసం ఆ నిధులైనా విడుదల చేయాలని వారు కోరుతున్నారు. వాస్తవానికి మందుల సరఫరా కొన్ని నెలల కిందటే ఆగిపోయిందని, బఫర్ స్టాక్‌తో ఇన్ని రోజులుగా నెట్టుకొచ్చామని వైద్యవర్గాలు తెలిపాయి. సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న ఈ సమయంలో మందుల నిల్వలు పెంచాల్సిందిపోయి, తగ్గించడం ఏమిటని ప్రభుత్వంపై రోగులు